# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 2 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL




## కుంటాలకు వరద తాకిడి

జలపాతం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతానికి భారీగా వరద తాకిడి పెరిగింది. దీంతో జలపాతం వద్ద వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. వరదనీటితో జలపాతానికి జలకళ సంతరించుకున్నది.



పొచ్చెర పరవళ్లు

పొచ్చెర జలపాతం వద్ద వరద ఉధృతి

బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలధార ఎత్తిపోస్తున్నది. జలపాతాన్ని తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో నిరంతరం కంట్రోల్ రూంలు నిర్వహిస్తూ ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.



మహారాష్ట్ర అధికారులు విడుదల చేసిన లేఖ

## వరదలపై అప్రమత్తం

మహారాష్ట్రలోని ఇసాపూర్ ప్రాజెక్టుల్లో 76 శాతం నీరు చేరినందున గేట్లు తీసే అవకాశం ఉన్నందని నాందేడ్, యావత్మాల్ అధికారులు లేక విడుదల చేశారు. తెలంగాణ గ్రామాలవారీని అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సమాచారం ఇచ్చారు.

## అమ్మవారి దర్శనానికి గొడుగులతో భక్తులు

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో వర్షపు నీరు చేరింది. రేకుల షెడ్ల లీకేజీ కారణంగా వర్షపు నీరు లోపలికి చేరుతున్నది. అక్షరాభ్యాస మండపాల్లో కూడా వర్షం నీరు చేరింది. కురుస్తున్న వర్షానికి కొన్ని చోట్ల బకెట్లు పెట్టారు. భక్తులు ఆలయంలో గొడుగుతో ప్రవేశించి అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయంలోకి గొడుగులతో వస్తున్న భక్తులు



కడెం ప్రాజెక్టును పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ కడెం ప్రాజెక్టును సందర్శించారు. చేపల వేటకు వెళ్లకూడదని, గ్రామాల్లో డప్పు చాటింపు చేపట్టి ప్రజలను అప్రమత్తంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



పునరావాస కేంద్రంలో కాలనీవాసులు

## జీఎన్ఆర్ కాలనీని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 1 : పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీని ఆదివారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల స్థితిగతులను పరిశీలించారు. ముందస్తుగా జీఎన్ఆర్ కాలనీలోని 40 కుటుంబాలను ఖాళీ చేయించి స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు పునరావాసం కల్పించారు. అక్కడ ఉన్న వారికి అధికారులు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఎక్కడైన సమస్య తలెత్తిలే వెంటనే 6305646600 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.




కడెం ప్రాజెక్టు నుండి దిగువకు విడుదలవుతున్న నీరు

# దంచికొట్టిన వాన

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం**

- నిండిన ప్రాజెక్టులు.. గేట్లు ఎత్తి దిగువనకు నీటి విడుదల
- జలపాతాలకు జలకళ.. నీట మునిగిన పొలాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. ఉప్పొంగిన వాగులు, వంకలు..
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు..

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. శనివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో జనం ఇండ్లు విడిచి బయటికి రాలేని పరిస్థితి నెలకున్నది. ఆదివారం సాయంత్రానికి గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లాలో భీంపూర్ మండలంలోని అర్లీ(టీ)లో అత్యధికంగా 133.8 మిల్లీ మీటర్లు, ఆదిలాబాద్(అర్బన్)లో 124.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో 128.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో 92.3, జైనథ్‌లో 90.4, తాంసిలో 88.0, బోథ్‌లో 87.6, సిరికొండలో 87.3, సొనాలలో 84.0, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, ఉట్నూర్, తలమడుగు మండలాల్లో భారీ వర్షం పడింది. నిర్మల్ జిల్లా భైంసాలో 89.3, కుంటాలలో 79.8, భైంసాలో 75.8, నిర్మల్‌లో 73.3 మిల్లీమీటర్లు.. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 87.8, కాగజ్‌నగర్ మండలంలోని జంబుగాలో 72.2, ఆసిఫాబాద్‌లో 71.0, లింగాపూర్, కెరిమెరిలో 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. జైపూర్ మండలంలో 60.5 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.

### నిండిన ప్రాజెక్టులు

మహారాష్ట్ర సహా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆదివారం ఉదయం 10 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. సాయంత్రానికి ఇన్ ఫ్లో తగ్గడంతో ఐదు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. రెండు గేట్లను ఎత్తి అదే స్థాయిలో నీటిని కిందకు వదులుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టుకు 6 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా ఇక్కడ కూడా రెండు గేట్లను ఎత్తి 12 వేల క్యూసెక్కులు కిందకు వదులుతున్నారు. కడెం గేట్లు ఎత్తడంతో పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరిగింది. ఇన్ ఫ్లో 1,29,453 క్యూసెక్కులు ఉండగా, 20 గేట్లను ఎత్తి 1,44,870 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి అధిక వరదలు వస్తున్న దృష్ట్యా డ్యామ్ మీద వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి కూడా కిందికి నీటిని వదులుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా మత్తడి వాగు ప్రాజెక్టు, సాత్నాల ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో గేట్లను ఎత్తి కిందికి నీటిని వదులుతున్నారు. భారీ వర్షాలకు ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోగా.. పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో పంట పొలాలు మునిగిపోయాయి. వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.



బోథ్ ప్రాజెక్టు అలుగు పారుతున్న నీరు

### చేలలో నిలిచిన నీరు

ఆదిలాబాద్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. భీంపూర్‌లో 12.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆదిలాబాద్ అర్బన్‌లో 9.9 సెం.మీ, నార్నూర్‌లో 9.4, తాంసిలో 8.9, ఆదిలాబాద్ రూరల్‌లో 8.8, ఇంద్రవెల్లిలో 8.6, బోథ్, సిరికొండలో 8.6, గాదిగూడలో 8.5, ఉట్నూర్‌లో 7.8, బేలలో 7.5, గుడిహత్నూర్‌లో 7, తలమడగులో 6.9, జైనథ్‌లో 6.8, ఇచ్చోడలో 5.1, నేరడిగొండలో 3.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### మత్తడి దుంకిన చెరువులు

తాంసి మండలంలోని మత్తడి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు మూడు గేట్లను ఎత్తి నీటిని బయటకు వదిలారు. జైనథ్ మండలం మహారాష్ట్ర సరిహద్దు ఆనంద్‌పూర్ వద్ద పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండు రాష్ట్రాలను కలిపే రోడ్డు పై నుంచి వర్షం నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భీంపూర్ మండలంలోని కరంజివాగు పొంగి ప్రవహిస్తుంది. పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. బోథ్ మండలంలోని కౌఠ, నక్కలవాగు వరదనీటితో పోటెత్తాయి. బజార్‌హత్నూర్, త్రివేణి సంగమం ప్రాజెక్టులు మత్తడి దుంకి ప్రవహిస్తున్నాయి. బోథ్ మండలంలోని పొచ్చెర, నేరడిగొండ మండలంలోని కుంటాల, కనకాయి జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. వరదనీరు పంట పొలాల్లోకి చేరింది.



ఇంద్రవెల్లి : కెస్లాగూడ శివారంలో పత్తి చేనులో చేరిన వర్షపు నీరు



ముథోల్ : హోటల్‌లో చేరిన వర్షపు నీరు



లక్ష్మీపూర్ వద్ద విరిగిపడిన 33 కేవీ విద్యుత్ స్తంభం

## విరిగిపడిన విద్యుత్ స్తంభం

జైనథ్ మీదుగా బేల మండలకేంద్రానికి వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం విరిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.



స్వర్ణ ప్రాజెక్టు వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల

## స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

స్వర్ణ ప్రాజెక్టును ఆదివారం కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకి షర్మిల సందర్శంచారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు గేట్లు, వరద ప్రవాహన్ని స్వయంగా పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో తెలుసుకున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, పాల్గొన్న అధికారులు

## అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. టీజీ ఎన్‌పీడీసీఎల్‌లోని ఎస్ఈ, డీఈలకు భారీ వర్షాల కారణంగా తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ చౌహన్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాకు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు పరిశీలించడం జరిగిందన్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న సిబ్బంది రాత్రిలో కష్టపడి విద్యుత్ సరఫరా సకాలంలో ఇచ్చినందుకు సిబ్బందిని అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## రేవంత్‌రెడ్డికి తెలంగాణపై ప్రేమలేదు

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణపై ప్రేమలేదని, ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు అత్యున్నత న్యాయస్థానాన్ని అవహేళన చేసే విధంగా మాట్లాడుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కవితకు బెయిల్ రావడంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చెయ్యాలని కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసినా ఏ ఒక్క బీజేపీ నాయకుడు ఆందోళన చేపట్టలేదని తెలిపారు. దీనిని బట్టి చూస్తే ఈ రెండు పార్టీలు ఒకటేనని అర్థం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు తగిన పాఠం చెబుతారన్నారు. హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ డబ్బులు గుంజే కార్యక్రమం చేస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్ ఉనికిని దెబ్బతీసి, ఆంధ్ర ప్రభుత్వానికి రేవంత్ రెడ్డి ఊడిగం చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీని ఆంధ్రకు తరలించే కుట్రకు రేవంత్‌రెడ్డి ఆజ్యం పోస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, పట్టణ అధ్యక్షుడు అజయ్, పార్టీ ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, శివ జగదీశ్, పరమేశ్వర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నష్టపోతున్నారని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ సంద అశోక్ అన్నారు. సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహంగా పాటిస్తు టీఎన్జీవోస్ భవనం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ మీదుగా ర్యాలీ ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనం వరకు సాగింది. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో వక్తలు కొత్త విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1, 2004న నూతన పెన్షన్ అమలులోకి వచ్చిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. అదేవిధంగా అటూ జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీఎన్జీఆర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఆర్ఎస్ రద్దు చేయడంతోపాటు ఓపీఎస్‌ను అమలు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి అన్నారు. అప్పటి వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, పేట సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, టీజీటీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చవాన్ నరేశ్, టీఎస్పీటీఏ అధ్యక్షుడు రియాజ్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయేశ్, జేఏసీ నాయకులు వృకోధర్, వెంకట్,సుదర్శన్, సప్తర్, నవీన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

# అనాథలూ.. ఆదుకోరూ

- నెల రోజుల క్రితం తల్లి.. నేడు తండ్రి మృతి
- విరాళాలు సేకరించి అంత్యక్రియలు
- దిక్కులేని వారైన ఇద్దరు పిల్లలు
- ఆదుకోవాలని వేడుకుంటున్న చిన్నారులు
- ఆర్థిక సాయం కోసం ఫోన్ పే నంబర్ **94418 38359**



పిల్లల బర్త్‌డే వేడుకల్లో రజిత-శ్రీను(ఫైల్)



శ్రీను ఇల్లు

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 1 : సిరికొండ మండల కేంద్రానికి చెందిన దాసరి శ్రీను-రజితలు 16 ఏండ్ల క్రితం వివాహం చేసుకున్నారు. శ్రీను పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి కూతురు మేఘన, కుమారుడు రిష్వంత్ ఉన్నారు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థాలు రావడంతో రజిత ఇద్దరు పిల్లలను తీసుకుని ఆదిలాబాద్‌కు వెళ్లింది. అక్కడే నివాసం ఉంటుంది. జూలై ఆఖరి వారంలో ఇచ్చోడ మండల కేంద్రానికి ఇద్దరు పిల్లలను తీసుకొచ్చి వారిని సిరికొండకు పంపించి ఆమె భర్తకు పిల్లలను పంపిస్తున్నాని, తాను పురుగుల మందు తాగానని వీడియో కాల్ చేసింది. హుటాహుటిన రజితను జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా.. శనివారం శ్రీను(36) ఓ మహిళ అంత్యక్రియల కట్టెల కోసం ట్రాక్టర్‌లో కొంత మందితో కలిసి అడవికి వెళ్లాడు. అక్కడ కాల్వలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. శ్రీను చనిపోయిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. అంత్యక్రియలు చేసే స్థోమత లేకపోవడంతో గ్రామస్తులు, యువకులు రూ.33 వేలు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులను కోల్పోవడంతో మేఘన, రిష్వంత్ అనాథలయ్యారు. వీరికి వ్యవసాయ భూమి లేదు. పాత ఇల్లు మాత్రమే ఉంది. దాతలు ముందు కొచ్చి తమకు ఆదుకోవాలని పిల్లలు వేడుకుంటున్నారు. తొకల చిన్న రాజన్న ఫోన్ పే నంబర్ 94418 38359 ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. దాసరి శ్రీను తల్లి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ గౌడ్ తెలిపారు.